

# నానమ్మ కోరిక

## శంకర్‌రావు శెంకేసి

ఇంటి దగ్గరినుండి వచ్చిన ఉత్తరం చదవగానే నాకు విషయం బోధపడింది. గడచిన మూడు నెలలుగా ఇంట్లో పెళ్ళి పోరును ఎలాగోలా ఎదుర్కొంటున్నా ఈ సారి మాత్రం పెళ్ళిచూపులకు వెళ్ళడం తప్పేట్లు లేదు.

ఎందుకంటే ఉత్తరం రాసింది నాన్నగారు కాబట్టి. ఎస్.ఐ.గా సెలెక్ట్ అయి ప్రొబేషనరీగా జాయినైన నెలరోజులకే ఇంట్లో నా పెళ్ళిగోల మొదలైంది. పెళ్ళి విషయంలో అమ్మానాన్నల ఒత్తిడికంటే ముందు, నానమ్మ ఒత్తిడి నాకు ఊపిరిసలపనివ్వడంలేదు.

"నానమ్మా నా పెళ్ళి గురించి నీకెందుకే అంత ఇంట్రెస్టు?" అని పోయిన సారి ఇంటికెళ్ళినప్పుడు నానమ్మతో వాదనతో దిగాను. అయినా ఫలితమేముంది.

"ఒరే రావుడూ..." అంటూ మొదలెట్టి "నీ పెళ్ళి చూడందే నేనా స్వర్గంలో నిశ్చింతగా వుండలేనురా" అంటూ తెలుగు సినిమాల్లోలా డైలాగులు రీవైండు చేస్తుంది. ఎప్పుడోగాని వుత్తరం రాయని నాన్న ఈ సారి వెంటనే రమ్మంటూ ఉత్తరం రాసాడంటే ఇదంతా ఖచ్చితంగా నానమ్మ ప్లానే అయ్యుంటుంది. పెళ్ళి పోరుతో తలనెప్పి తెప్పిస్తున్నా.. నానమ్మంటే నాకెంతో ఇష్టం. అసలీరోజు నేను పోలీసు డ్రెస్సులో ఎస్.ఐ.గా గన్ పట్టుకుట్టున్నానంటే అదంతా నానమ్మ ఇచ్చిన ప్రేరణే. మా తాతయ్య అంటే నానమ్మ భర్త అప్పట్లో పోలీసు పటేలుగా పనిచేసేవాడట. నేను పుట్టకముందే ఆయన కాలం చేయటంవల్ల నేనాయనను ప్రత్యక్షంగా చూడలేదుగాని, మా ఇంటి మధ్య రూమ్‌లో ఆజానుబాహుత్వంతో, పెద్దపెద్ద మీసాలతో గోడకు వేలాడే ఆయన నిలువెత్తు ఫోటోను చూసినప్పుడల్లా నాకు ఎంతో అబ్బురం వేసేది.

"నానమ్మా... తాతయ్యలా కావాలంటే ఏం చెయ్యాలి?" అని నా చిన్నతనంలో నానమ్మను ప్రశ్నించడం నాకింకా గుర్తు.

తాతయ్య అధికారం, దర్పం, పలుకుబడి గురించి నా చిన్నతనంలో నానమ్మ కథలు కథలుగా చెబుతుంటే చెవులప్పగించి విన్న దృశ్యాలు నాకళ్ళముందు ఇప్పటికీ కదలాడుతూనేవుంటాయి. అప్పటినుండీ తాతయ్యలా కావాలనే కోరిక నాలో బలంగా నాటుకుపోయి ప్రేరణగా నిలిచింది. సెలవుతీసుకొని ఇంటికి బయలుదేరేందుకు సన్నద్ధమయ్యాను.

****

రైలు దిగగానే స్టేషన్‌లో నాన్నగారు ఎదురొచ్చారు. 'మీకెందుకునాన్నా అంత శ్రమ' నాన్నను చూస్తూనే పలకరించాను. 'ఇందులో శ్రమేముందిరా' అంటూ నాన్న నా భుజం తడుతూ క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. ఇద్దరం కల్సి ఆటోలో ఇంటికి బయలుదేరాం. విషయం అర్థమవుతున్నా ఉత్సుకతను ఆపుకోలేక మెల్లగా నాన్నను కదలించాను. నాన్న మొహంలో చిరుదరహాసం. బదులిచ్చారేకాని భావం బోధపడలేదు.

రోడ్డుని వెనక్కి నెట్టేస్తూ ఆటో పరుగెడుతోంది. నా ఆలోచనల్లాగే....

పెళ్ళిచేసుకోవడానికి నాది రైట్ ఏజే అయినా గోపీకృష్ణ జీవితం గుర్తొచ్చినప్పుడల్లా నాకు పెళ్ళి మీద విరక్తి భావం కలుగుతుంది. గోపి ఎంత దురదృష్టవంతుడు. నిజానికి వాడిపేరు గుర్తొస్తేనే నాలో విషాదం పొంగుకొస్తుంది. మా ట్రెయినింగ్ పీరియడ్‌లో నాకు పరిచయమై దగ్గరైన వాళ్ళల్లో గోపీకృష్ణ మొదటివాడు. ట్రెయినింగ్ చివరిరోజుల్లో వాడికి పెళ్ళి సెటిలవ్వడం, వాడి పెళ్ళికి నేను, నాకొలీగ్స్ వెళ్ళి ఆనందంగా గడపటం నాకెప్పటికీ గుర్తుండే అనుభవం. అప్పుడే నేను వాడి కుటుంబానికి ఫ్యామిలీ ఫ్రెండుగా మారిపోయాను. తర్వాత రెండురోజులకే మా ఇద్దరికీ వేర్వేరు జిల్లాల్లో ప్రొబేషనరీ ఎస్.ఐ.లుగా పోస్టింగులు రావడం బాధకల్గించినప్పటికీ ఉద్యోగరీత్యా తప్పనిసరికావడంతో మేమిద్దరం విడిపోక తప్పలేదు. క్యాంపును వీడే చివరిరోజున 'నన్ను మర్చిపోవు కదరా' అంటూ గోపి నన్ను ఆత్మీయంగా హత్తుకున్న క్షణాలు నాలో శాశ్వతంగా నిలచిపోయాయి.

కాని, విధివాడిపట్ల క్రూరంగా వ్యవహరించింది. కొత్తజీవితం, కొత్త ఉద్యోగం ప్రారంభించిన నెలరోజులకే నక్సలైట్ల మందుపాతర రూపంలో మృత్యువు వాడి ప్రాణాన్ని కబళించింది. కూంబింగ్ కోసం కానిస్టేబుళ్ళతో గోపీకృష్ణ జీపులో వెదుతుండగా నక్సలైట్లు మందుపాతర పేల్చడంతో గోపి నిండు జీవితం ఛిద్రమైపోయింది. పెళ్ళయిన నెలరోజులకే వాడి భార్య విధవగా మారిపోయింది.

ఎవరికి ఏం ద్రోహం చేసాడని వాడిని పొట్టనబెట్టుకున్నారు? కాళ్ళపారాణి ఆరకముందే, కన్నకలలు ఫలించకముందే ఏ పాపం చేసిందని వాడి భార్యకు సౌభాగ్యాన్ని దూరం చేశారు. ఇప్పటికీ ఇవి నాలో జవాబులేని ప్రశ్నలుగా రగిలిపోతూనే వున్నాయి.

గోపి కన్నుమూసిన తర్వాత నా జీవితంపై నాకే ఎన్నడూలేని విరక్తి కల్గిం

ది. వ్యవస్థపై ప్రకటించిన పోరాటాన్ని వ్యక్తులపైకి గురిపెడుతున్న తీవ్రవాదానికి నిండు జీవితాలు ఇలా బలికావల్సిందేనా? వృద్ధాప్యంలో తమన ఆదుకుంటాడని ఆశించిన తల్లిదండ్రుల నమ్మకాలు, జీవితాంతం తనకు తోడుగా వుంటాడని భావించిన జీవిత సహచరి కన్నకలలు మా ప్రమేయం లేకుండానే ఇలా నిస్తేజంగా మారాల్సిందేనా?

"పోలీసు ఉద్యోగం చేసే వాడికిచ్చి పెళ్ళి చెయ్యొద్దని ఎంతమంది చెప్పినా వినకుండా పెళ్ళిచేసినందుకు నాకు తగిన శాస్తే జరిగింది. అయ్యో... నా కూతురు బతుకు ఇప్పుడేం కావాలి...?"అంటూ గోపి అత్తామామలు తమ కూతురుపై బడి రోదించిన దృశ్యం ఇంకా నాకళ్లముందు మెదులుతూనేవుంది.

తీవ్రవాద ప్రాబల్యం గల ప్రాంతాల్లో పోలీసు ఉద్యోగాలు చేసే వ్యక్తులకు భార్యాపిల్లలు అనే భవబంధాలుండటం సరిపడవని గోపి జీవితం నాకు తెలియజెప్పింది. ఎస్.ఐ.గా ప్రతీ క్షణం కత్తిమీద సాముగా గడపాల్సి వచ్చే నేను పెళ్ళి చేసుకొని, జీవితానికి గ్యారంటీ లేని పరిస్థితుల్లో జీవితభాగస్వామికి ఎలా న్యాయం చేయగలను? రోజుల తరబడి నా మనస్సిలా అంతర్గత సంఘర్షణ పడుతుండగానే ఎస్.ఐ.గా నాకు ఆర్నెళ్ళు గడచిపోయాయి. ఆటోకు బ్రేకు పడగానే ఆలోచనా ప్రవాహం నుండి నేను బయటపడ్డాను. ఇంట్లోకి వెళ్ళగానే అమ్మా, నానమ్మా ఎదురొచ్చి ఆప్యాయతతో పలకరించారు.

****

"ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవడం నాకిష్టంలేదు నాన్నా" కొలువుదీరిన కుటుంబదర్బారులో పెళ్ళి విషయం ప్రస్తావించిన నాన్నకు సమాధానంగా పలికాను.

"రామా! పెళ్ళి విషయం ఎత్తగానే ఎందుకురా అలా మొండికేస్తావ్? పెళ్ళి చేసుకొనే వయస్సు కాదట్రా నీది?" అమ్మ అనునయంగా కల్పించుకుంటూ అంది.

"ఒరేయ్... నీవు ఉద్యోగంలో చేరినప్పటినుండి ఎన్ని సంబంధాలొస్తున్నాయో లెక్కలేదు. ఇంటికి చిన్నవాడివి, నీ ఒక్కడి పెళ్ళి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది."

నాన్నకూడా అమ్మకు మద్దతుగా పలికాడు. నానమ్మ మాత్రం ఇంకా నోరు విప్పలేదు.

క్షణాలు గడుస్తున్న కొద్దీ, చర్చ సాగుతున్న కొద్దీ అమ్మానాన్నల నుంచి నాపై ఒత్తిడి పెరుగుతోంది. అమ్మాయి సెలెక్టు విషయంలో తమకెలాంటి పట్టింపులు లేవని, ఇష్టపడ్డ అమ్మాయినే చేసుకొమ్మని, ప్రేమ వ్యవహారముంటే చెప్పమని ఒసారి బుజ్జగిస్తూ, మరోసారి ప్రశ్నిస్తూ, ఇంకోసారి ఆజ్ఞాపిస్తూ అడిగిచూసారు అమ్మానాన్న. కాని వారి అన్ని ప్రశ్నలకు నా మౌనమే సమాధానంగా నిలచింది.

అర్ధాంతరంగా ముగిసిన గోపీకృష్ణ జీవితం, కాళ్ళపారాణి ఆరకముందే శోకమయం అయిన వాడి భార్య జీవితం నా కళ్ళ ముందు సజీవంగా కదలాడుతూ వుంటే పెళ్ళికి నా మనసెలా అంగీకరిస్తుంది? మౌనమే నా స్పందన కావడంతో అమ్మానాన్నలు మిన్నకుండిపోయారు. కుటుంబ దర్బారులో నిశ్శబ్దం తాండవిస్తోంది.

క్షణాలు యుగాల్లా దొర్లుతున్నాయి.

"ఒరే అబ్బాయ్!" నిశ్శబ్దాన్ని ఛిద్రం చేస్తూ నానమ్మ గొంతు పలికింది.

ఏమిటన్నట్లు నానమ్మ వైపు చూసాడు నాన్న.

"నీ కొడుక్కేమైనా.... అనారోగ్యం వుందో కనుక్కో...!"

అంతే! ఆమె మాటలు పూర్తికాకముందే "నానమ్మా..." అంటూ నా గొంతు పౌరుషంతో ఉరిమింది. నా దాంపత్య శక్తిని ప్రశ్నించిన నానమ్మ మాటతో నా ముఖంలోకి జివ్వున రక్తం చిమ్మింది.

"ఒరేయ్ రావుడూ.. ఎందుకురా అలా అరుస్తావ్? పెళ్ళిచేసుకునే ఈడు కాదా నీది? బతకడానికి ఉద్యోగం వుంది. సంసారం చేయడానికి వయస్సుంది. మరేమైందని నువ్వు పెళ్ళికి ఒప్పుకోవడం లేదు? ఆర్నెళ్ళుగా చూస్తున్నాను. ఎప్పుడూ ఏదోఒక వంక చెప్పి పెళ్ళిని వాయిదా వేస్తున్నావే గాని, మా ఆశలు, మా కోరికలు మాత్రం పట్టించుకోవడం లేదు." నానమ్మ ఏమాత్రం తగ్గకుండా విసురుగా అంది.

........

" ఒరే అబ్బాయ్ నువ్వేమైనా చేయి. ఈ సారి మాత్రం వాడు పెళ్ళికి ఒప్పుకోవాల్సిందే. 'అబ్బాయి ఒప్పుకోవడంలేదు కదా నేనేం చేయనే' అని నువ్వు మళ్ళీ చేతులెత్తేస్తే మాత్రం నేను ఊరుకునేది లేదు." నాన్నను ఉద్దేశిస్తూ ఆగ్రహం, అనురాగం కలిసిన స్వరంతో నానమ్మ ఆజ్ఞాపిస్తున్నట్లుగా అంది.

ఆ క్షణంలో నానమ్మ మాటలు నాలో యుక్తాయుక్త విచక్షణలను చంపేసాయి.

" నానమ్మా... నీకేం తెలుసని నా పెళ్ళిగురించి అంత పట్టు బడుతున్నావు. పెళ్ళి జరగాల్సింది నాకిష్టమున్నప్పుడే గాని, మీరనుకున్నప్పుడుకాదు. నా ఆలోచనలు, నా భావాలతో నిమిత్తం లేకుండా పెళ్ళి.. పెళ్ళి అని మీరు మొత్తుకున్నంత మాత్రాన ఒప్పేసుకోవడానికి నేనేం కీలుబొమ్మను కాను. మీ వెనకటి ఆలోచనలకు, ఇష్టాలకు తలూపడానికి నేను గంగిరెద్దును కాను" అప్రయత్నంగా, అనాలోచితంగా ఆర్నెళ్ళుగా ఒంటబట్టిన సహజ పోలీసు స్వభావంతో తీవ్రంగా అన్నాను.

ఊహించని నా ప్రతిస్పందనకు అమ్మానాన్నలు నిశ్చేష్టులుకాగా, నానమ్మ నొచ్చుకొంది.

.......

"పుణ్యాత్ముడు... పోయి ఏ స్వర్గంలో వున్నాడో కాని, నన్నిక్కడ వదిలేసింది ఇలా మాటలనిపించుకోవడానికా? నలుగురు ఆడ పిల్లల, ఇద్దరు మగ పిల్లల పెళ్ళిళ్ళు చేసినప్పుడు కూడా నేనిలా మాటలు పడలేదు. కాని ఇప్పుడు.... చివరి మనవడి పెళ్ళి చూసి తృప్తిగా వెళ్ళిపోదామనుకుంటే స్వార్థంకోసం నేనేదో చేస్తున్నట్లు నన్నే ఆడిపోసుకుంటున్నారు" నానమ్మ కళ్ళు ఒత్తుకుంటూ అంది.

నానమ్మ మాటలతో నాలో నిస్సహాయత ఆవరించింది.

"ఒరే అబ్బాయ్ నీ కొడుకు.. నీ ఇష్టం. పాతం కాలంనాటి మనిషిని నా మాటలు ఇప్పుడెక్కడ చెల్లుబాటవుతాయి? పెళ్ళి ఎప్పుడు కుదిరితే అప్పుడు నాకు ఓ కార్డు ముక్క రాసి పోస్టులో పంపించు. చేతనయితే వచ్చి ఆశీర్వాదాలిచ్చి వెళతా. అంతదాకా నా మకాం పెద్దాడింట్లోనే" ముక్తసరిగా మాట్లాడి నానమ్మ అక్కడి నుండి లేవబోయింది.

వెళ్ళిపోవద్దని నానమ్మను నేనే వారించాను. పెళ్ళికి నేనెందుకు ససేమిరా అంటున్నానో అందుకు కారణమేమిటో నానమ్మకు చెప్పకపోతే ఆవిడ ఎన్ని అపోహలు పడుతుందో, ఎంతగా ఫీలవుతుందో నేను ఊహించగలిగాను.

గోపీకృష్ణ జీవితం, పెళ్ళయిన నెల రోజులకే వాడి భార్య విధవగా మారిన వైనం, తీవ్రవాద ప్రాంతాల్లో ఎప్పుడు ఏమవుతుందో తెలీని క్షణభంగురమైన మా ప్రాణం, పెళ్ళి పట్ల నాలో నాటుకుపోయిన భావప్రవాహం... గురించి నానమ్మకు పూసగుచ్చినట్లు వివరించాను.

కుటుంబ దర్బారులో మళ్ళీ అదే నిశ్శబ్దం.

"నానమ్మా... ఇప్పుడు చెప్పు. ఈ ఉద్యోగంలో వుండి నా ప్రాణం ఎప్పుడు పోతుందో నాకే తెలీని పరిస్థితుల్లో నేనెలా పెళ్ళిచేసుకోను? పెళ్ళిచేసుకొని మరో అమాయక జీవిని జీవితాంతం ఎలా క్షోభపెట్టను? పెళ్ళంటే నూరేళ్ళ పంట అన్నారుకదా! నూరేళ్ళు కాదుకదా నిండా నెలరోజులుకూడా జీవితం పంచుకోకుండానే గోపిలాగే నా జీవితం ముగిస్తే మరో ప్రాణికి అన్యాయం చేసిన పాపం నాకు తగలదా?" నిశ్శబ్దాన్ని చీలుస్తూ, నానమ్మను చూస్తూ ఉద్వేగంగా అన్నాను.

అంతే! తన బోసినోటితో నానమ్మ గొల్లున నవ్వింది.. తెరలుతెరలుగా నవ్వింది...నాలో విస్మయం... అమ్మానాన్నల్లో సంభ్రమాశ్చర్యం.

'ఒరేయ్ రావుడూ...' తెరలు తెరలుగా అలా నవ్వుతూనే పిలిచింది నానమ్మ.

.......

" పిచ్చి పిల్లాడా... అగ్ని సాక్షిగా ఏడడుగులు నడచి కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన ప్రతీ స్త్రీ తన భర్తతో తాను ఎంతకాలం బతుకుతానని ఆలోచించదురా.. ఎలా బతుకుతానని ఆలోచిస్తుంది. రావణ కాష్టంలా నిత్య పోట్లాటలతో నూరేళ్ళు బతకడం కన్నా, మంచి మనస్సుతో కల్మశంలేని ఆత్మీయతానురాగాలతో, ఎల్లలులేని ప్రేమానుబంధాలతో నెలరోజులుకాదురా ఒక్కరోజు బతికినా భార్యాభర్తలు అనే బంధానికి సార్థకత్వం కలుగుతుంది"నానమ్మ కొత్త భాష్యం నన్ను విచలితున్ని చేసింది.

"రావుడూ.... ఎవరి ప్రాణమూ శాశ్వతం కాదు. పోలీసుకాని వాడు పెళ్ళి చేసుకుంటే నూరేళ్ళు బతుకుతాడని ఏ గ్యారంటీ లేదు. భార్యాభర్తల బంధానికి ఎన్ని సంవత్సరాలు కాపురం చేశారనేది కొలమానం కాదురా? వారు ఎంత ప్రేమానురాగాల్ని, ఎంత ఆత్మీయతల్ని పంచుకున్నారన్నదే వారి బంధానికి సరైన నిర్వచనం" అనుభవంతో నాన్నమ్మ చెబుతున్న మాటలు నాలో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. అర్థంలేని ఆలోచనలతో గజిబిజిగా వున్న నా అంతరంగంలో నానమ్మ బోసిమాటలు కొత్త భావతరంగాలు ఊసులాడేలా చేసాయి.

నా మాటలతో నానమ్మను నొచ్చుకునేలా చేసినందుకు పశ్చాత్తాపంతో నా కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఒక్క ఉదుటున లేచి నానమ్మ వద్దకు పరుగిడి నానమ్మ అరచేతుల్లో ముఖం పెట్టి నన్ను క్షమించమని ఆనందబాష్పాలు తన్నుకొస్తుండగా వేడుకున్నాను. ●

"పాతం కాలంనాటి మనిషిని నా మాటలు ఇప్పుడెక్కడ చెల్లుబాటవుతాయి? పెళ్ళి ఎప్పుడు కుదిరితే అప్పుడు నాకు ఓ కార్డు ముక్క రాసి పోస్టులో పంపించు"